సాక్షి
నిర్మల్
గురువారం । 4 । జూలై । 2024



ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తి!
కుభీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులు లేక రోగులకు సేవలు అందడంలేదు. దవాఖానా స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులెవరూ పట్టించుకుంటలేరు. 9లో▸



ఆర్థికభారం తగ్గించాలి
ఆర్థికభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. నిధులు లేక అభివృద్ధికి సొంత డబ్బులు వెచ్చించామని ఆవేదన వ్యక్తంజేశారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.0 /26.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నర్సాపూర్ (జీ): మండలంలోని తురాటి గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు పరిశీలించి చిన్నారులకు అందుతున్న సేవలను టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బైక్‌పై వెళ్లి సెగ్రిగేషన్ షెడ్డు, శ్మశానవాటికను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులున్నారు.

జీలుగ సాగు పరిశీలన



జీలుగను పరిశీలిస్తున్న డీఏవో

నర్సాపూర్ (జీ): తిమ్మాపూర్ (జీ) గ్రామంలో రైతులు సాగు చేసిన జీలుగను డీఏవో అంజిప్రసాద్ బుధవారం పరిశీలించా రు. జీలుగ సాగు చేసిన పొలంలో యూరియా తక్కువ మోతాదు వాడాలని రైతులకు సూచించారు. ఏఈవో గణేశ్, రైతు ఉదగిరి లస్మన్న ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

భైంసారూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజమ్‌హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాన్‌టీచింగ్ వర్కర్స్

నిర్మల్‌చైన్‌గేట్: కస్తూరిబా విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల కస్తూరిబా విద్యాలయాల నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డీఈవో రవీందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న మాట్లాడారు. కస్తూరిబాల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్‌తో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, వారి సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు ఏమాత్రం సరిపోవటం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కంటే తెలంగాణ ప్రభుత్వం తక్కువ వేతనాలు చెల్లిస్తోందని ఆరోపించారు. కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, ఏఎన్ఎంలకు నైట్ డ్యూటీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కే లక్ష్మి, జిల్లా కార్యదర్శి కవిత, జయసుధ, పార్వతి, లక్ష్మి, నర్సమ్మ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్, మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్లతో ప్లాస్టిక్ నిషేధం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వాడకుండా వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తున్న, నిల్వ చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వినియోగించిన, విక్రయించినవారికి జరిమానా విధించాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేయాలని ఆదేశించారు. దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, రెస్టారెంట్లు ఇతర ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని తెలిపారు. శిథిలావస్థలోని భవనాలు కూల్చివేయాలని, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

కడెం.. ఆధునికం



కడెం ప్రాజెక్ట్

- సెన్సార్లు, సీసీ కెమెరాల బిగింపు
- కొనసాగుతున్న ట్రయల్ రన్
- పవర్ హౌస్‌లో కంట్రోల్‌రూం
- ఇక్కడి నుంచే గేట్ల ఆపరేటింగ్
- ఇక కచ్చితమైన నీటి లెక్కలు

కడెం: స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డాటా ఆక్విషన్) సాంకేతిక వ్యవస్థ ద్వారా కడెం ప్రాజెక్ట్ ఆధునికీకరణ పూర్తయింది. ఈ సిస్టం ద్వారా ఆధునికీకరించాలని ప్రభుత్వం రాష్ట్రంలో మూడు ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసింది. ఇందులో కడెం ప్రాజెక్ట్‌ను చేర్చుతూ రూ.కోటి ప్రపంచ బ్యాంక్ నిధులతో ఆధునీకీకరించింది. స్కాడా సిస్టం ద్వారా ఇక కచ్చితమైన ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో లెక్కలు రానున్నాయి. 2022 నవంబర్‌లో ప్రారంభించిన పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ట్రయల్ రన్ నడుస్తోంది.

ఇక కచ్చితమైన సమాచారం

కడెం ప్రాజెక్ట్‌కు స్కాడా సిస్టం ఏర్పాటు చేయడంతో ఇక కాకి లెక్కలకు చెక్ పడనుంది. ఇదివరకు ప్రాజెక్ట్ నీటి మట్టం, ఇన్‌ఫ్లో వివరాలు ప్రాజెక్ట్ పైగల గేజ్ రూంలో చూసేవారు. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, అక్కడి నుంచి వచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యేవారు. రెండేళ్లుగా వానాకాలంలో ఊహించని స్థాయిలో 6లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. కానీ.. స్కాడా సిస్టంతో ఎగువ ప్రాంతాల్లోని వాగుల వద్ద సెన్సార్లు ఏర్పాటు చేయడంతో ప్రాజెక్ట్‌కు ఎంత మేర ఇన్‌ఫ్లో వస్తుందనేది కంట్రోల్ రూంకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతోంది. ప్రాజెక్ట్ వరద గేట్ల నుంచి ఎంత మేర అవుట్ ఫ్లో వెళ్తోందనే కచ్చితమైన లెక్కలు నమోదవుతున్నాయి.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

అంతా కంట్రోల్‌రూం నుంచే..

స్కాడా సిస్టం ఏర్పాటులో భాగంగా ప్రాజెక్ట్ ఒకటో నంబర్ గేటు సమీపంలో పాత పవర్‌హౌస్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఇందులో స్కాడా సిస్టం ఆపరేటింగ్ వ్యవస్థ ఉంటుంది. ఇందులో ఏర్పాటు చేసిన పెద్ద స్క్రీన్ ద్వారా అధికారులు ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకోనున్నారు. వరద గేట్లను ఆపరేటింగ్ చేయనున్నారు. గతంలో వరదగేట్లు ఎత్తేందుకు, దించేందుకు ప్రాజెక్ట్ సిబ్బంది గేటు వద్దకు వెళ్లి మోటార్ల సాయంతో ఆపరేట్ చేసేవారు. స్కాడా సిస్టం ట్రయల్ రన్ పూర్తయి అందుబాటులోకి వస్తే ప్రాజెక్ట్‌పై అరకొర సిబ్బంది ఉన్నా ప్రస్తుత స్కాడా టెక్నాలజీ ద్వారా గేట్ల నిర్వహణ సులభమవుతుంది.

సెన్సార్ల బిగింపు..

స్కాడా సిస్టంలో భాగంగా కంట్రోల్‌రూం వద్ద టవర్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల్లో సెన్సార్లు, సీసీ కెమెరాలు బిగించారు. ప్రాజెక్ట్ మొత్తం 18 వరద గేట్లలో జర్మనీ గేట్లకు ఒక్కొక్కటి, మిగతా తొమ్మిది ఇండియన్ గేట్లకు రెండు చొప్పున సీసీ కెమెరాలు బిగించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రాజెక్ట్ సమాచారం

పూర్తిస్థాయి నీటిమట్టం:
700 (7.603టీఎంసీ) అడుగులు
ప్రస్తుత నీటిమట్టం:
677.500 (3.119 టీఎంసీ) అడుగులు
ఆయకట్టు : 68 వేల ఎకరాలు

గేట్ల మరమ్మతు పూర్తి

కడెం ప్రాజెక్ట్‌కు రూ.9.26 కోట్లతో చేపట్టిన వరద గేట్ల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. రెండో నంబర్ గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. నీటిని నిల్వ చేసి చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తంజేస్తున్నారు.

ట్రయల్ రన్ నడుస్తోంది



వరద గేట్లు, ప్రాజెక్ట్ ఎగువనున్న పరీవాహక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, సెన్సార్లు బిగించి, పవర్‌హౌస్‌లో కంట్రోల్ సిస్టం ఏర్పాటు చేశాం. ప్రస్తుతం ట్రయల్‌రన్ కొనసాగుతోంది. ట్రయల్ రన్ పూర్తయితే స్కాడా సిస్టం అందుబాటులోకి రానుంది.
– బోజదాసు, ప్రాజెక్ట్ డీఈ

అల్పాహారం అందేనా?



జిల్లా కేంద్రంలోని హోటల్‌లో టిఫిన్ తింటున్న విద్యార్థులు

- పథకానికి గత ప్రభుత్వం శ్రీకారం
- ప్రస్తుతం ఊసెత్తని కాంగ్రెస్ సర్కారు
- నిరీక్షిస్తున్న నిరుపేద విద్యార్థులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన 'సీఎం అల్పాహార పథకం' నిలిచింది. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు విజయదశమి కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించింది. తొలి విడతగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి పాలవడం, పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఉదయం పరీక్షలు, మధ్యాహ్నం తరగతులు ఉండటంతో తాత్కాలికంగా ఈ పథకానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పూర్తిగా నిలిచిపోయింది.


గైర్హాజరును తగ్గించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో మెజార్టీ పిల్లలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాటు తల్లిదండ్రులు వ్యవసాయ, ఇతర పనుల్లో బిజీగా ఉండటంతో ఉదయం వేళ వారికి ఇంట్లో అల్పాహారం సిద్ధం చేయలేని పరిస్థితి. ఉదయం తొమ్మిది గంటలకే తరగతులు ప్రారంభం అవుతుండటంతో మెజార్టీ పిల్లలు ఏమీ తినకుండానే స్కూల్‌కు వచ్చేవారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఖాళీ కడుపుతో ఉండేవారు. ఉదయం నుంచి ఏమీ తినకపోవడంతో కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉత్పన్నమవుతుండేవి. తరచూ గైర్హాజరుకు కారణమవుతుండేది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు వారి ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం అల్పాహార పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో అమల్లో ఉన్న ఈ పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని భావించింది. ఆ మేరకు అప్పటి అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గతేడాది దసరా కానుకగా ఈ పథకాన్ని జిల్లాలోని పాఠశాలలో ప్రారంభించారు. ప్రతీరోజు ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో పాఠశాలకు వచ్చిన ప్రతీ విద్యార్థికి రోజుకో రకమైన అల్పాహారం అందించేవారు.

ఖాళీ కడుపుతో విద్యార్థులు..

జిల్లాలో 760 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 56,491 మంది విద్యార్థులు చదువుతున్నారు. సీఎం అల్పాహార పథకంలో భాగంగా వీరికి రోజుకో వెరైటీ పలహారం అందించడం ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.100 కోట్ల మేర భారం పడనున్నట్లు అంచనా వేసింది. అయినా ఖర్చుకు వెనుకాడకూడదని నిర్ణయించింది. అప్పటికే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం.. కొత్తగా అల్పాహార పథకాన్ని అమల్లోకి తీసుకురావడంతో ఉపాధ్యాయవర్గాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కాగా, వేసవి సెలవులు ముగిసి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమైనా ఉదయం అల్పాహారం తిరిగి ప్రారంభం కాలేదు. దీంతో నిరుపేద విద్యార్థులకు పస్తులు తప్పడం లేదు. పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల్లో స్పష్టత లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంకా ఆదేశాలు రాలేదు



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారం అందించే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదు. పథకానికి సంబంధించి బడ్జెట్ రిలీజైన వెంటనే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తాం. – రవీందర్‌రెడ్డి, డీఈవో

తులం బంగారం ఏమాయె?

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లక్ష్మణచాంద: కల్యాణలక్ష్మి పథకంలో ఆడబిడ్డలకు ఇచ్చే రూ.లక్ష నూట పదహారుతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఏమైందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ పద్మతో కలిసి 82మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, వృద్ధులకు రూ.4వేల పింఛన్, ప్రతీ మహిళకు నెలనెలా రూ.2,500 ఇచ్చేదాకా వదలబోమని తెలిపారు. తాను అసెంబ్లీ సాక్షిగా చేసిన పోరాట ఫలితంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు పంటరుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం తాను ఢిల్లీకి వెళ్లి కేంద్రం నుంచి రూ.30 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్, తహసీల్దార్ జానకి, ఎంపీటీసీ సభ్యులు నర్సారెడ్డి, రాజేశ్వర్, అనిత, నాయకులు గంగన్న, రమేశ్, భూపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, తాజా మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: నియోజకవర్గంలోని నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద: లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. నాయకులు శ్రావణ్‌కుమార్, బడిపోతన్న, సాహెబ్‌రావు, మధు, తిరుమలాచారి, గంగారెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ



భైంసాటౌన్: ఎస్పీని కలిసిన అవినాష్‌కుమార్



నిర్మల్‌టౌన్: శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

భైంసాటౌన్: భైంసా ఏఎస్పీగా అవినాష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన కాంతిలాల్‌పాటిల్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో అసాల్ట్ కమాండర్ (గ్రేహౌండ్స్) అవినాష్‌కుమార్‌ను కేటాయిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు భైంసాకు చేరుకున్న ఆయనకు పట్టణ సీఐ డీ రాజారెడ్డి, ఎస్సైలు, ఏఎస్సైలు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అంతకుముందు ఎస్పీ జానకీషర్మిలను అవినాష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అవినాష్‌కుమార్ బీహార్ రాష్ట్రానికి చెందినవారు కాగా, రూర్కీ ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2021లో సివిల్స్‌లో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ దళ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

క్రీడల అధికారిగా శ్రీనివాస్..

నిర్మల్‌టౌన్: జిల్లా స్పోర్ట్స్ కార్యాలయంలో బుధవారం నూతన క్రీడల అధికారిగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాక్సింగ్, జూడో, కిక్ బాక్సింగ్ అసోసియేషన్‌ల తరఫున శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీధర్, సెక్రటరీ చందుల స్వామి, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ శివకుమార్, జూడో అసోసియేషన్ సెక్రటరీ సాయికిరణ్, సభ్యులు చిరంజీవి, రాజశేఖర్, మనీష, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

పరిషత్‌లలో 'ప్రత్యేక'ం



కడెం: పదవీవిరమణ చేస్తున్న ఎంపీపీ అలెగ్జాండర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, నాయకులు

- ముగిసిన ఎంపీటీసీల పదవి
- నేటితో జెడ్పీటీసీల పదవి కూడా..
- ఇక ప్రత్యేకాధికారులకు బాధ్యతలు

నిర్మల్: పల్లెపాలనలో కీలకమైన స్థానిక సంస్థల పాలన గడువు ముగిసింది. మండల పరిషత్‌కు సంబంధించి ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీల ఐదేళ్ల పాలన బుధవారంతో ముగిసింది. ఇక జిల్లా పరిషత్ పాలకవర్గం గడువు గురువారంతో ముగిసిపోనుంది. గ్రామాభివృద్ధిలో స్థానిక సంస్థలే కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటికే పంచాయతీల గడువు ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారులకు పాలన పగ్గాలు అప్పగించారు. తాజాగా మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీకాలం ముగిసిపోతోంది. ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు నిర్వహించేవరకు వీటి బాధ్యతలనూ అధికారులే తీసుకోనున్నారు. జిల్లాలో మొత్తం 18 గ్రామీణ మండలాలు ఉండగా, 18 జెడ్పీటీసీ, 156 ఎంపీటీసీ స్థానాలున్నాయి.

నిట్టూర్పే మిగిలింది!

ఐదేళ్లపాటు అధికారంలో ఉన్నట్లే కానీ.. పెద్దగా చేసిందేమీ లేదని చాలామంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నిట్టూరుస్తున్నారు. తమ పాలన కాలంలోనే కరోనా మహమ్మారి రావడంతో రెండేళ్లపాటు ఎలాంటి పనులనూ చేపట్టలేకపోయామని వాపోయారు. ఇక మిగతా కాలంలోనూ తమ పరిధికి సంబంధించి సరిపడా నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులను చేయించలేకపోయామన్న ఎంపీటీసీ సభ్యులున్నారు.

అప్పట్లో అలా..

మొత్తం 18 జెడ్పీటీసీ స్థానాలకుగాను ఐదేళ్లక్రితం జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీగా ఉన్న బీఆర్ఎస్ 12 స్థానాలను కైవసం చేసుకుంది. నిర్మల్ రూరల్, సోన్, లక్ష్మణచాంద, సారంగపూర్, నర్సాపూర్(జీ), లోకేశ్వరం, కుభీర్, తానూరు, ముథోల్, బాసర, భైంసా, దస్తురాబాద్ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసింది. మొత్తం 156 ఎంపీటీసీ స్థానాల్లోనూ 84చోట్ల గెలుపొందింది. ఇందులో ఎన్నికల కంటే ముందే నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్, మేడిపెల్లి, సారంగపూర్ మండలం చించోలి(బీ), ఆలూరు, మామడ మండలంలోని పరిమండల్ స్థానాలను ఏకగ్రీవం చేసుకుంది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఐదు జెడ్పీటీసీ స్థానాలను దక్కించుకుంది. దిలావర్‌పూర్, మామడ, కుంటాల, ఖానాపూర్, కడెం స్థానాలను హస్తగతం చేసుకుంది. బాసర, నర్సాపూర్ స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయింది. ఇక ఎంపీటీసీ స్థానాల్లో 52 చోట్ల కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. క్షేత్రస్థాయిలో పెద్దగా పట్టులేకున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించాలన్న లక్ష్యంతో పోటీ చేసిన బీజేపీ తన ఉనికిని చాటుకుంది. జెడ్పీటీసీ స్థానాల్లో బోణీ కొట్టకున్నా.. ఆరు ఎంపీటీసీ స్థానాలను దక్కించుకుంది. మామడ, భైంసా మండలాల్లో ఏ పార్టీకీ సరైన మెజార్టీ దక్కకపోవడంతో బీజేపీ అభ్యర్థులు ఇక్కడ కీలకమయ్యారు. ఇక అప్పటి ఎన్నికల్లో స్వతంత్రులూ సత్తా చాటారు. ఎంపీటీసీ స్థానాల్లో 14చోట్ల గెలుపొందగా, పెంబి జెడ్పీటీసీ స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థి భూక్య జానకీబాయి దక్కించుకున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నో రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు కూడా పార్టీలు మారారు. అప్పుడు ఒక పార్టీలో ఉన్నవారు ఇప్పుడొక పార్టీలో కొనసాగుతున్నారు. రానున్న ఎన్నికల్లో వారు ఏ పార్టీ నుంచి పోటీచేస్తారో కూడా తెలియని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రత్యేకాధికారుల నియామకం

జిల్లాలోని 18గ్రామీణ మండలాల్లో ఎంపీపీ, ఎంపీటీసీల పాలన బుధవారం ముగిసింది. ఈమేరకు ఆయా మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ అభిలాష ఉత్తర్వులు జారీ చేశారు. ఇక గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగనుంది.

మండలం	ప్రత్యేకాధికారి
సోన్	గోవింగ్, జెడ్పీ సీఈవో
నిర్మల్‌రూరల్	రత్నకల్యాణి, నిర్మల్ ఆర్డీవో
సారంగపూర్	గంగాధరయ్య, పశుసంవర్ధకశాఖ ఏడీ
లక్ష్మణచాంద	మోహన్‌సింగ్, డీడబ్ల్యూఎంవో
మామడ	శ్రీకళ, పౌరసరఫరాల డీఎం
కడెం	విజయలక్ష్మి, డీఆర్డీవో
ఖానాపూర్	బాబురావు, సీపీవో
పెంబి	నర్సింహారెడ్డి, పరిశ్రమల జీఎం
దస్తురాబాద్	రాజేశ్వర్‌గౌడ్, డీఎస్‌సీడీవో
దిలావర్‌పూర్	శంకర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో
నర్సాపూర్(జీ)	అంజిప్రసాద్, డీఏవో
లోకేశ్వరం	శ్రీనివాస్‌బాబు, జిల్లా భూగర్భజలశాఖాధికారి
కుంటాల	శ్రీనివాస్, డీపీవో
భైంసా	కోమల్‌రెడ్డి, భైంసా ఆర్డీవో
కుభీర్	మనోహర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ
ముథోల్	నందిని, డీసీఎస్వో
బాసర	మధుసూదన్, ఫిషరీస్ ఏడీ
తానూరు	అష్రఫ్‌అహ్మద్, మార్కెటింగ్ ఏడీ

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌ఖిల్లా: భవన నిర్మాణ, అనుబంధ పనుల్లో అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో పలువురు భవన నిర్మాణ రంగ కార్మికులు, సెంట్రింగ్ మేస్త్రీలు, కూలీలతో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు కార్మికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్వదేశ్ మాట్లాడుతూ.. ఈ–శ్రమ్, బీవోసీ వర్కర్స్ బోర్డుల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలని, అధిక గాఢత కలిగిన రంగులు వేస్తున్నప్పుడు మాస్కులు, కంటి అద్దాలు, బూట్లు వినియోగించాలని సూచించారు. యూనియన్ నాయకులు అజారొద్దీన్, చింత చిన్నయ్య, కార్యాలయ సమన్వయకర్త కొమ్ము గీత, నాయకులు శంకర్, సుభాష్ తదితరులున్నారు.



కార్మికులకు గుర్తింపుకార్డులు ఇస్తున్న స్వదేశ్

క్లుప్తంగా

కొండచిలువను పట్టుకున్న స్నేక్‌క్యాచర్



కొండచిలువను పట్టుకున్న అనిల్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి కొండ చిలువను గమనించిన స్థానికులు బ్లూకార్ట్ పోలీసు సిబ్బంది అజార్‌ఖాన్, అనిల్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు స్నేక్ క్యాచర్ అనిల్‌కు సమాచారం అందించ డంతో చాకచక్యంగా కొండచిలువను పట్టుకు న్నాడు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకు న్నారు. అర్ధరాత్రి పిలవగానే వచ్చి కొండచి లువను పట్టుకున్న అనిల్‌ను, బ్లూకార్ట్ సిబ్బం దిని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నక్క మృతి

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహ దారిపై మాటేగాం గ్రామ సమీపంలో బుధ వారం గుర్తు తెలియని వాహనం ఢీకొని నక్క మృతి చెందింది. గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అం దించడంతో ఖననంచేశారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన విద్యార్థి గోపాల్ (14) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఏఎస్సై యూనుస్ తెలిపారు. సదరు విద్యార్థి గల్లీలో ఆడుకుం టూ వెళ్తున్న క్రమంలో కూలర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కౌలురైతు ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

పెంబి: ఆర్థిక ఇబ్బందుల తో కౌలురైతు మృతి చెం దిన సంఘటన మండ లంలో చోటు చేసుకుం ది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండ లంలోని యాపలగూ డకు చెందిన అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని అందులో పత్తి విత్తనాలు విత్తాడు. వర్షాలు కురియక విత్తనాలు మొలకె త్తక పోవడంతో పంట సాగుకు చేసిన అప్పు లు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం కడెం వాగు ఒడ్డున గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం నిర్మల్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లోకేశ్వరం: మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్నపై భూతగాదా విష యంలో అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్ జూన్ 24న దాడి చేయడంతో తీవ్రగాయాల య్యాయి. నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు.

సికిల్ సెల్ సెంటర్ తనిఖీ



కేసులు పరిశీలిస్తున్న అధికారి ప్రభాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: సికిల్ సెల్ రాష్ట్ర అధికారి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగం గా బుధవారం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మావల మండలంలో గల వాఘాపూర్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లో రక్త హీనతతో బాధపడు తున్న కేసులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మం డల వైద్యాధికారి సర్ఫారాజ్, జిల్లా ఆఫీస్ అధికారి డీడీఎం శివప్రసాద్, వాఘాపూర్ సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ రోజారమణి, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

జైనూర్: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఉరే సుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మం డలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కు మార్ తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని పోచంలొద్ది గ్రామానికి చెందిన శేక్ ఆరిఫ్(32) మూడేళ్లుగా మతిస్థిమితం కోల్పో యాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడం తో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృ తునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

కాంగ్రెస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యే దుస్థితి వచ్చిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జీపీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వ చ్చి ఆరు నెలలు గడుస్తున్నా పంచాయతీల్లో ఎలాం టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కనీస పరిపాలన వ్యవహారాలు, అభివృద్ధి పనులు చేసు కోలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు ఇబ్బందు లు ఎదుర్కొంటున్నాయన్నారు. జీపీల్లోని ట్రాక్టర్ల లో డీజిల్ నింపుకోలేని స్థాయికి నిర్వహణ దిగజారి ందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం గ్రామ పంచాయతీలను పట్టించుకోలేదన్నారు. కేం ద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను స్థానిక సం స్థలకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావే శంలో బీజేపీ నాయకులు యతీంద్రనాథ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



వంటలు పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారు లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యా యుల అటెండెన్స్, స్టాక్‌రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వంటగది , స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జె క్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

- కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ధర్నా

కైలాస్‌నగర్: విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నియామకానికి డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వ హించారు. పలువురు కార్యాలయ గేటు ఎక్కి లోనికి వెళ్లేందుకు యత్నించారు. అయితే వారిని పోలీసు లు సముదాయించి ఐదుగురిని మాత్రమే లోనికి అనుమతించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇంకా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచ నీయమన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం తో పాటు స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలనే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, నిఖిల్, శివసాయి, హరీశ్, కార్తీక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు పక్కాగా చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో పంటల భీమా, పం టల నమోదును పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవ సాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలని సూచిం చారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన, విక్ర యించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డీఏవో అంజిప్రసాద్ తదితరులున్నారు.

విద్యార్థులపై కోతుల దాడి



గాయపడిన విద్యార్థిని

బోథ్: మండలం లోని పొచ్చర ప్రభుత్వ పాఠశా లలో బుధవా రం ఇద్దరు వి ద్యార్థులపై కో తులు దాడి చే యడంతో గా యాలయ్యాయి. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న అయిట్ల చరిత, మూడో తరగతి చదువుతున్న సుస్మితపై కోతులు దాడి చేయ డంతో గాయాలయ్యాయి. వెంటనే బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. నిత్యం పాఠశాలలోకి కోతులు వచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని గ్రామ స్తులు పేర్కొంటున్నారు. అధికారులు కోతు లను నియంత్రించాలని కోరుతున్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

మంచిర్యాలక్రైం: దేశ వ్యాప్తంగా ఈనెల 1 నుం చి నూతన చట్టాలు అమలుకాగా మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్లో అదనపు కట్నం కింద బుధవారం తొలికేసు నమోదైంది. గతంలో అదనపు కట్నం కింద నమోదు చేసే కేసుల్లో 498(ఏ) నమోదు చేసేవారు. కొత్త చట్టం అమ లైన తర్వాత కొత్త సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజయ్య తెలిపారు. పట్టణంలోని కాలేజీరోడ్‌కు చెందిన నామగాని ఓదెలు–మల్లమ్మ దంపతుల కుమార్తె రమను జైపూర్ మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని సాయిచందర్ గౌడ్ ఆరేళ్ల క్రితం పెద్దల ఒప్పందం మేరకు ప్రేమ వివాహం చేసుకున్నాడు. పెళ్లిలో వరక ట్నం కింద రూ.6 లక్షల నగదు అందజేశారు. కొంత కాలంగా సాయిచందర్ గౌడ్, అతని బాబాయ్ శంకర్‌గౌడ్ అదనపు కట్నం తేవా లని వేధిస్తుండడంతో రమ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

‘మహాలక్ష్మి’ అమలులో ప్రభుత్వం విఫలం



ధర్నాలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైం దని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.2500 నగదు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగం గా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని ప్రకటించిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా.. ఇప్పటికీ అమలు చేయకపోవడం విచారకరమ న్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షు రాలు ధోని జ్యోతి, కార్యదర్శి అనిత, సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు పట్టుకున్న దొంగ

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామ సమీపంలోని పంటపొలాల్లో బోరు మోటార్లు, కేబుల్ వైర్లు ఎత్తుకెళ్తున్న ముత్యం అనే వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భైంసా పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ముత్యం బుధవారం గ్రామ సమీపంలోని వాగు వద్ద మోటారు వైర్‌ను కాలుస్తుండగా గమనించిన గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా బోరు మోటారు కేబుల్ వైర్లు, ట్రాక్టర్ బ్యాటరీలు తదితర వస్తువులు చోరికి గురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

స్త్రీ నిధి రుణ బకాయిలు రూ.16 కోట్లు

- రీజనల్ మేనేజర్ పూర్ణచందర్



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ పూర్ణచందర్

బోథ్: జిల్లా వ్యాప్తంగా రూ.16 కోట్ల శ్రీనిధి రుణాలు పేరుకుపోయాయని శ్రీనిధి రీజనల్ మేనే జర్ పూర్ణచందర్ అన్నారు. రుణాలు చెల్లించకపోతే ఆయా గ్రామాల్లోని మిగతా మహిళా సంఘాలకు సైతం భవిష్యత్‌లో రుణాలు మంజూరు చేసే వీలుం డదన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయాన్ని సం దర్శించి సీసీలతో సమావేశం నిర్వహించారు. అనం తరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో శ్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు రూ.112 కోట్ల రుణాలు ఇచ్చామని, ప్రస్తుతం రూ.16 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. మహిళలకు రూ.50 వేల నుండి రూ.3 లక్షల వరకు రుణాలు ఇస్తున్నా మని అన్నారు. రుణాలు పొందిన మహిళలకు బీమా చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందితే రూ. 10 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షల వరకు బీమా ఉందన్నారు. ఆయా సం ఘాలు రుణాలు చెల్లించాలని అన్నారు. సమావేశం లో ఏపీఎం మాధవ, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ముగ్గురిపై టూటౌన్ పోలీసులు బుధ వారం కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల ఓ గోదాంలో 266 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహ్మద్ ముజాహిద్ రసూల్, షౌకత్ అలీ, దేవేందర్ అగర్వా ల్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

కత్తిపోట్ల కలకలం..

- ఒకరిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాహుల్

ఆదిలాబాద్‌రూరల్/ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాల నీలో బుధవారం రాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన రాహుల్, ఇమ్రాన్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో రాహుల్‌పై ఇమ్రాన్ కత్తితో దాడి చేయ డంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా దాడి చేసిన వ్యక్తిపై హత్యాయత్నం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు



వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన వ్యక్తికి రిమ్స్‌లో న్యూరో సర్జరీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డైరెక్టర్ వెల్లడిం చారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రోహన్‌కు ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్ప త్రిలో చేర్పించారు. అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉండగా న్యూరోసర్జన్ విజయ్ మోహన్ శస్త్ర చికిత్స చేశారు. పది రోజుల పాటు పర్యవేక్ష ణలో ఉంచి డిశ్చార్జ్ చేశారు. ఈ ఆపరేషన్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేయిస్తే రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని డైరెక్టర్ తెలిపారు. రిమ్స్‌లో న్యూరో, కార్డియాలజీ, యూరాలజీ, ఇతర సేవలు అందుబాటులో ఉన్నాయని, రోగులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైద్యులు ఇద్రిస్ అక్బాని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



బుచ్చన్న (ఫైల్)

కడెం: మండలంలోని నర్సా పూర్ గ్రామం సమీపంలో ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దస్తురాబాద్ మండలం దేవునిగూడెం గ్రామానికి చెందిన గుజ్జుల బుచ్చన్న (60) చికిత్స పొం దుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం ఎక్సెల్ వాహనంపై వస్తున్న బుచ్చ న్నను కారు ఢీ కొట్టడంతో తలకు గాయాల య్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్ ఆస్ప త్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విష మించడంతో బుధవారం మృతి చెందాడు. మృ తుని తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమా దానికి కారణమైన మెట్‌పల్లికి చెందిన డ్రైవర్ రవీం దర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

బాసర ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక

బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశానికి ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా నుంచి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎంపికయ్యారు.

మామడ: నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పొన్కల్, కొరిటికల్, మామడ జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలల్లో వి ద్యను అభ్యసించిన 11 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యా రు. పొ న్కల్ పాఠశాలకు చెందిన సుతారి సాకేత్, పల్లి కొండ లక్ష్మణ్, పత్రి ప్రవస్తి, మామడ పాఠశాలకు చెందిన కృష్ణ, శివకుమార్, పల్లవి, ప్రశాంత్, కొరిటి కల్ పాఠశాలకు చెందిన మద్దుల రాహుల్, మేకల అభిలాష్, మేక ల చెల్సి, బట్టు సవిత ఎంపిక య్యారు. ఎంపికైన విద్యార్థులను పొన్కల్ పాఠశాల లో ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, ఉపా ధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు కిష్టన్న తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపి కయ్యారు. బుధవారం విడుదల చేసిన జాబితాలో సీట్లు సాధించారు. పాఠశాలకు చెందిన మనీషా, గోలి శరణ్య, పూదరి గంగోత్రి, నాగబిందు, హర్షిత, మేఘన, పులి శరణ్య ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం అభినందించారు.

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన అల్లం మనోజ్‌కుమార్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యా డు. బుధవారం విడుదలైన ప్రొవిజనల్ జాబితాలో చోటు లభించింది. మనోజ్‌ను గ్రామస్తులు, ఉపా ధ్యాయులు, స్నేహితులు అభినందించారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని నవేగాంబస్తీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్ బుధవారం ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతుండగా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. అఫ్రోజ్ నుంచి 18 వేల రూపాయల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రిమ్స్‌లో వన మహోత్సవం



మొక్క నాటుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్ప త్రిలో బుధవారం రెండోరోజు వన మహోత్సవం కొనసాగింది. రిమ్స్ వైద్యులు, మెడికోలు ఆస్పత్రి ఆవరణలో దాదాపు 200 వరకు మొక్కలు నాటారు. పర్యావరణను పరిరక్షించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో రిమ్స్ వైద్యులు చంద్రశేఖర్, కార్తీక్, దేవిదాస్, మెడికోలు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీని దాటుతున్న ‘సాత్నాల’



ఆదిలాబాద్ నియోజక వర్గంలో 24 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన సాత్నాల ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీని దాటుతోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 70 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. 286.50 మీటర్ల ఎఫ్‌ఆర్ ఎల్, 1.24 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం, 279.75 మీటర్ల ఎత్తులో 0.185 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. – జైనథ్